గడపగడపకూ సంక్షేమ పథకాలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

- లబ్ధిదారులు బీఆర్ఎస్‌కు అండగా నిలువాలి
- ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను దీవించాలి
- విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 7: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రతి గడపగడపకూ చేరాయని, లబ్ధిదారులు ఎన్నికల్లో పెద్ద మనసుతో సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థులను మరోసారి దీవించి అండగా నిలువాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సిటీ సెంటర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి ఆశీర్వదిస్తారని ధీమా ఉందన్నారు. తెలంగాణలోని కార్మికులు, కర్షకులు, దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాయని, అలాంటివారు కేసీఆర్ వెంటే నడుస్తారన్న ధీమా తమకుందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 9వేల మంది దివ్యాంగులు నెలనెలా పింఛను తీసుకుంటున్నారని, వారి కుటుంబ సభ్యులతో కలిపి సుమారు 36 వేల మంది కేసీఆర్ పింఛను పైన ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. దివ్యాంగులు త్వరలోనే ఆశీర్వాద సభ పెట్టి బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు సిద్ధమయ్యారన్నారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంతో రైతులు రెండు పంటలు పండించుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఇలా అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలను ఆదుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి, పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగురి ప్రభాకర్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, సీనియర్ నాయకులు కొలిపాక సమ్మయ్య, మక్కపల్లి రమేశ్‌యాదవ్, ఎర్ర శ్రీధర్, మోరె మధు, భిక్షపతి, రవికుమార్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌టౌన్: ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్‌పర్సన్ నిర్మల, మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ రమాదేవి తదితరులు

హుజూరాబాద్ రూరల్: కాట్రపల్లి గ్రామంలో ప్రజలకు పథకాలు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ప్రచారం.. ముమ్మరం

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 7: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా పురపాలక సంఘం చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కల్లెపల్లి రమాదేవి, కౌన్సిలర్లు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, పార్టీకి అండగా ఉండాలని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. పట్టణ శివారులోని పొలాల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి మహిళా కూలీలకు వివరించి, బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి, మారపెల్లి సుశీల, ఉమాదేవి, కేసిరెడ్డి లావణ్య, మొలుగు సృజన, ప్రతాప మంజుల, మాజీ ఎంపీటీసీ కొయ్యడ శ్రీదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో..

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 7: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించి, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాసగోని కిరణ్‌కుమార్, వంగ రాములు, పెరుమండ్ల సదానందం, సబ్బని రమేశ్, రావుల సత్యం, మైస సుధాకర్, పూదరి రమేశ్, బాలగోని పూర్ణ, మాడుగుల సురేశ్, పెరమండ్ల శ్రీనివాస్, తాళ్లపల్లి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ'కి ప్రగతి శోభ

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా నిర్మించిన కాట్రపల్లి గ్రామపంచాయతీ భవనం

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామాల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు శిథిల భవనాల్లో కొనసాగిన పంచాయతీ కార్యాలయాలకు సకల వసతులతో కొత్త సచివాలయాలు సమకూరాయి. ఇందుకు నిదర్శనం హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం. ఇక్కడి జీపీ భవనం శిథిలావస్థకు చేరుకోగా.. దానిని కూల్చివేసి రూ. 25 లక్షలతో కొత్త భవనం నిర్మించారు. అన్ని హంగులతో నిర్మించిన ఈ భవనాన్ని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల ప్రారంభించి అందుబాటులోకి తీసుకురాగా, ఎన్నో ఎండ్ల తమ కల సాకారమైందని పాలకవర్గంతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-హుజూరాబాద్, నవంబర్ 7

దశాబ్దాల కల నెరవేరింది

గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ సర్కారు అందిస్తున్న సహకారం అభినందనీయం. ఒకప్పుడు పంచాయతీలు శిథిలమైన భవనాల్లో కొనసాగేవి. ఈ క్రమంలో ప్రభుత్వం రూ. లక్షల నిధులు మంజూరు చేసి అన్ని వసతులతో భవనాలు నిర్మించడం హర్షణీయం. మా గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణంతో గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరింది.

- కాసగోని నిరోష, సర్పంచ్(కాట్రపల్లి)

కేసీఆర్‌తోనే అభివృద్ధి

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం. బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నది. ఇప్పటికే పల్లెల్లో వీధివీధిన రోడ్లు వేశారు. అన్ని వసతులు కల్పించారు. అలాగే పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించడం అభినందనీయం.

- తొగరు శివకృష్ణ, కాట్రపల్లి

కాట్రపల్లి పాత జీపీ భవనం (ఫైల్)

పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో పాడి కౌశిక్‌రెడ్డి, పెద్ది రెడ్డి, గెల్లు శ్రీనివాస్

బీఆర్ఎస్‌లో చేరికలు

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 7: జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 30 మంది మంగళవారం జూపాక గ్రామంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని కౌశిక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి, టీఎస్‌టీడీసీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు వీణవంక మండలంలో కౌశిక్‌రెడ్డి ప్రచారం

వీణవంక, నవంబర్ 7: హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, మల్లన్నపల్లి, ఘన్ముక్ల, రెడ్డిపల్లి గ్రామాల్లో జరిగే బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 7 గంటలకు బ్రాహ్మణపల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని తెలిపారు.

ముగిసిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 7: హుజూరాబాద్ హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్- 17 బాయ్స్ అండ్ గర్ల్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఇందులో 100 మీటర్ల పరుగులో అజయ్‌కుమార్ (జడ్పీహెచ్ఎస్ చెల్పూర్) ప్రథమ, ఎస్ దేవేందర్ (గర్ల్స్ హైస్కూల్ హుజూరాబాద్) ద్వితీయ, 200 మీటర్ల పరుగులో ఏ వివేక్ (గర్ల్స్ హైస్కూల్ హుజూరాబాద్)ప్రథమ, కే ఆశిష్‌కుమార్ (జడ్పీహెచ్ఎస్ పెద్దపాపయ్యపల్లి)ద్వితీయ, 400 మీటర్ల పరుగు పందెంలో గౌరీ ప్రసాద్ కే ఆకాష్ ప్రథమ, జే శృతి (ఏకశిల)ద్వితీయ, 100 మీటర్ల పరుగులో టీ మేఘన (గర్ల్స్‌హై స్కూల్)ప్రథమ, జే శృతి (ఏకశిలా) ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వివిధ అంశాల్లో క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ హుజూరాబాద్ మండల కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేముల రవికుమార్, టీ భాగ్యలక్ష్మి, సీహెచ్ శ్రీనివాసరావు, ప్రవీణ, ఎస్ అనిల్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపిక

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 7: మండలంలోని సింగాపూర్ గ్రామంలో గల వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు శాతవాహన యూనివర్సిటీ తరపున ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ హనుమాకుమార్, ఫిజికల్ డైరెక్టర్ సిద్దమల్ల విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జి. రాహుల్, టి. నిఖిల్, జి. వేణు ఈ నెల 9 నుంచి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరుగబోయే సౌత్‌జోన్ యూనివర్సిటీ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీల్లో ఆడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఫిజికల్ డైరెక్టర్

ఐదు నామినేషన్లు దాఖలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 7: హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గానికి మంగళవారం నలుగురు ఐదు నామినేషన్లు దాఖలు చేసినట్లు హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 12 నామినేషన్లు దాఖలయ్యాయని చెప్పారు.